వేడుకల్లో భాగంగా చిన్నారుల వేషధారణ

అల్ఫోర్స్‌లో క్రిస్మస్ వేడుకలు

జగిత్యాల, డిసెంబర్ 23: పట్టణంలోని కృష్ణానగర్‌లో గల అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్, శివవీధి లో గల అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలను విద్యా సంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. శాంతాక్లాస్ నీ పరిచయం చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు అలపించిన గేయాలు అలరించాయి. ఇక్కడ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

'నీరాజనం' కవితా సంకలనం ఆవిష్కరణ

కవిత సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

జగిత్యాల, డిసెంబర్ 23: జగిత్యాల కళాశ్రీ సాహితీ వేదిక సామాజిక మాధ్యమ సమూహ ప్రధాన సభ్యురాలు, కవయిత్రి నీరజచంద్రన్ రూపొందించిన నీరాజనం కవితా సంకలనాన్ని సోమవారం తిరుమల స్వామివారి సన్నిధిలో ఆవిష్కరించారు. కళాశ్రీ సమూహ ప్రతినిధులు గుండేటి రాజు, అయిత అనిత, లక్కరాజు శ్రీ లక్ష్మి, ఓదెల గంగాధర్, మాడిశెట్టి శ్రీనివాస్, పోపూరి మాధవి లత, మాధవి హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

కోరుట్ల రూరల్, డిసెంబర్ 23: పైడిమడుగులోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ మెయిన్స్ పుస్తకాలను సోమవారం అందజేశారు. ప్రముఖ గణితశాస్త్ర శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని చాంద్ పబ్లికేషన్ సేల్స్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ అందజేసిన ఐఐటీ, జేఈఈ మెయిన్స్ పుస్తకాలను ఉపాధ్యాయులతో కలిసి హెచ్ఎం ఆనంద్ విద్యార్థులకు అందజేశారు. ఇక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

బాలుడిపై అత్యాచారం కేసులో 20 ఏండ్ల జైలు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 23 : బాలుడిపై అత్యాచారం కేసులో ఓ వ్యక్తికి 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జగిత్యాల ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన గోగుల సాయికుమార్ మామిడికాయలు ఇస్తానని ఓ బాలుడికి ఆశచూపి గ్రామ శివారులోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అప్పటి మల్లాపూర్ ఎస్ఐ పృథ్వీధర్ కేసు నమోదు చేయగా, అప్పటి మెట్‌పెల్లి సీఐ రవికుమార్ శ్యాంకుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసును విచారించి సాక్షులను, శాస్త్రీయ ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా, కేసు వాదించిన పీపీ నేరాన్ని రుజువు చేయడంతో నేరస్తుడు సాయికుమార్‌కు 20 ఏండ్ల కఠిన జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు జగ్జా సోమవారం తీర్పునిచ్చారు. నేరస్తుడికి శిక్షపడేలా విచారణ చేపట్టిన ఎస్ఐలు పృథ్వీధర్, రవికుమార్, కోర్టు కానిస్టేబుల్ రంజిత్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

విచ్చలవిడిగా మట్టి తరలింపు

- అనుమతికి మించి తరలిస్తున్నారంటూ గామస్తుల ఆరోపణలు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 23: మెట్‌పల్లి మండలంలో సహజ వనరుల సంపదను అక్రమార్కులు విచ్చలవిడిగా కొల్లగొడుతున్నారు. వరదకాలువ నుంచి అనుమతికి మించి మట్టి తరలిస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట శివారులోని 33వ కిలో మీటర్ నుంచి 35వ కిలోమీటర్ వరద కాలువ నుంచి మట్టి తవ్వకాలకు ఈనెల 21 నుంచి 25 వరకు మల్లాపూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి అనుమతులు పొందారు. కేవలం 300 క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపుకే ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతి పొందిన గుత్తేదారు ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.109 చొప్పున మొత్తం రూ. 32,700 చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించారు. అలాగే సీనరేజ్, మైనింగ్ ఇతర చార్జీలు రూ.16,380 చలానా కట్టారు. అయితే ఇక్కడ సుమారు 12 నుంచి 13 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల టిప్పర్లతో ప్రతిరోజు 16 ట్రిప్పులకు మించి మట్టి తరలిస్తున్నట్లు విమర్శలున్నాయి. అంటే రోజుకు 200 క్యూబిక్ మీటర్ల చొప్పున ఇప్పటికే మూడు రోజుల్లో 600 క్యూబిక్ మీటర్లకు మించి మట్టి తరలించినట్లు తెలుస్తోంది. ఫలితంగా ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. అలాగే సోమవారం అనుమతి లేని టిప్పర్లతో మట్టి తరలించడంతో పలువురు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా, వాటిని పట్టుకొని వదిలిపెట్టినట్లు తెలిసింది.

అనుమతి లేని టిప్పర్‌లో తరలుతున్న మట్టి

అనుమతితోనే మట్టి తరలింపు

300 క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపునకు ఎనిమిది టిప్పర్లకు అనుమతినిచ్చాం. ఇందులో కొన్ని టిప్పర్లు మరమ్మతు కావడంతో అదనంగా మరో నాలుగు టిప్పర్లలో మట్టి తరలించుకున్నారు. ఈ నెల 25 వరకు మట్టి తరలింపునకు అనుమతి ఉన్నది. నిబంధనల మేరకే మట్టి తరలిస్తున్నారు. ఒకవేళ అనుమతికి మించి మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

- అరుణోదయ్, ఇరిగేషన్ డీఈఈ (మెట్‌పల్లి)

విద్యార్థినికి అభినందన

విద్యార్థిని ఫాతిమాతో డీఈవో రాము

జగిత్యాల టవర్ సర్కిల్, డిసెంబర్ 23: రాష్ట్రస్థాయి జాతీయ గణితం టాలెంట్ పరీక్షలో ప్రతిభ చూపిన ఖాజీపురా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సపూర ఫాతిమాను సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో కే రాము అభినందించారు. అలాగే ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంఏ రహీమ్, సమీయొద్దీన్, డాటి శ్రీనివాస్, ఖతీబ్ ఫాయిమ్, రాజ్‌కుమార్, అజీజ్, సిబ్బంది కూడా డీఈవో అభినందనలు తెలిపారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన

పెగడపల్లి ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల ర్యాలీ

పెగడపల్లి, డిసెంబర్ 23: మూఢనమ్మకాలు, సైబర్ క్రైం, ట్రాఫిక్ నిబంధనలు, నూతన చట్టాలపై సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో జిల్లా పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇక్కడ ఎస్ఐ రవికిరణ్, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది, కళా బృందం సభ్యులు వెంకటరెడ్డి, రమేశ్ ఉన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థికి పురస్కారం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

కోరుట్ల, డిసెంబర్ 23: పట్టణానికి చెందిన రైజింగ్ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల విశ్వం ఎడ్యుకేట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. సీనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి, రెండో ర్యాంకులు, జూనియర్ విభాగంలో రెండో ర్యాంకు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కుడేల రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి పురస్కారాలు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కుడేల నిఖిత, డైరెక్టర్లు మోహన్, షహనాజ్ బేగం, అధ్యాపకులు అభినందించారు.

మక్క చేనును పరిశీలిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థుల క్షేత్ర పర్యటన

రాయికల్, డిసెంబర్ 23: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థులు (8వ తరగతి) సోమవారం క్షేత్ర పర్యటన చేశారు. మైతాపూర్ లోని పొలం, రాయికల్‌లో కొయ్యడి మహిపాల్‌కు చెందిన పాడి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పంటల సాగు విధానం, సాంకేతిక పద్ధతులు, పాడి పరిశ్రమపై రైతులు అవగాహన కల్పించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ బాలె శేఖర్, డైరెక్టర్ నిఖిల్‌కుమార్, రైతులు కొయ్యడి మహిపాల్‌రెడ్డి, ఏనుగుల అంజన్న, శివనీతి గంగారెడ్డి, గోవిందుల రాజన్న, మహేశ్, తదితరులు ఉన్నారు.

ముగ్గురి అరెస్ట్

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 23: అర్ధరాత్రి ఓ వ్యక్తిపై దాడిచేసిన ముగ్గరిని అరెస్ట్ చేసినట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన మద్దెల యశ్వంత్, ఆలకుంట విజయ్, రెడ్డిమల్ల స్నేహిత్‌లు ఆదివారం అర్ధరాత్రి మల్యాలకు చెందిన అడువాల కృష్ణపై దాడి చేసి గాయపర్చారని, అదేవిధంగా సదరు యువకిడిని డ్రైనేజీలో వేసి బండరాయితో కొట్టారు. గాయపడ్డ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాడి చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో మావోయిస్టు నేత?

సారంగాపూర్, డిసెంబర్ 23: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మావోయిస్టు కీలక నేత బల్మూరి నారాయణరావును ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నారాయణరావు అలియాస్ ప్రభాకర్‌రావు యాక్టివ్ నార్త్ సబ్ జోనల్ బ్యూరోలో లాజిస్టిక్స్ సప్లై, ఎంవోపీవోఎస్ టీమ్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. 1984లో నక్సల్స్ సంస్థలో పార్టీ సభ్యుడిగా చేరిన ఆయన 40 ఏళ్లుగా చురుకుగా పనిచేస్తున్నారు. ఆదివారం సీనియర్ మావోయిస్టు క్యాడర్ ప్రభాకర్‌రావును కంకేర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఆయనపై ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. సీసీఎం మావోయిస్టు కార్యదర్శి ముప్పాళ్ల గణపతి బంధువు నారాయణరావు. డీకేఎస్‌జడ్‌సీ సభ్యుడు ప్రభాకర్‌రావు అలియాస్ నారాయణరావుపై ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. కొన్ని రోజులుగా కంకేర్‌లో నిషేదిత, చట్టవిరుద్ధమైన సీపీఐ మావోయిస్టు సంస్థకు చెందిన నార్త్ బస్తర్ సబ్ జోనల్ బ్యూరోకు చెందిన సీనియర్ మావోయిస్టు క్యాడర్ ప్రభాకర్‌రావు కార్యకలాపాలు ఉన్నట్లు నిఘా పోలీసులు గుర్తించారు. ఈ నెల 22న కంకేర్‌లోని అంతఘర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు జరిపిన ఆపరేషన్‌లో ప్రభాకర్ రావు అలియాస్ బల్మూరి ప్రభాకర్‌రావును అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు సమాచారం. బల్మూరి నారాయణరావు (57) ధర్మపురిలో ఇంటర్ వరకు చదువుకుని అదే సమయంలో అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లి వివిధ హోదాల్లో పని చేసినట్లు సమాచారం.